# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఢిల్లీలో ఈ రోజు నిర్వహించే కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారు.

2. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిహ్నంతో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

3. పులుల సంరక్షణకు చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు.

4. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త లబ్ధిదారులకు ఇంటి స్థలం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.

5. తెలంగాణ నూతన గవర్నర్‌గా నియమితులైన జిష్ణుదేవ్ వర్మ రేపు రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

6. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని ఈరోజు పాటిస్తున్నాం.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు మధ్యాహ్నం ఢిల్లీలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ – సిఐఐ నిర్వహిస్తోన్న “వికసిత భారత్ వైపు ప్రయాణం” అనే కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. వికసిత భారత్ సాధించడంలో పరిశ్రమల పాత్రతో పాటూ... ప్రభుత్వ దూర దృష్టిని తెలియజేయడమే లక్ష్యంగా ఈ సదస్సు జరగనుంది. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, దౌత్య సంఘాలు, ప్రభుత్వ ప్రతినిధులు వెయ్యి మందికిపైగా ప్రత్యక్షంగానూ, విదేశాలలో ఉన్న వివిధ సిఐఐ కేంద్రాల నుండి పరోక్షంగానూ హాజరుకానున్నారు.

--------------------------

రాష్ట్రంలోని రైతులకు రాష్ట్ర చిహ్నంతో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూశాఖలో ప్రస్తుత పరిస్థితులు మదనపల్లె తరహా ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, గత ఐదేళ్లలో తెచ్చిన చట్టాలు, వాటి పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ, వారసత్వంగా వచ్చిన ఆస్తులపై ఎవరి ఫోటోలు ఉండకూడదనే ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో

ప్రజావ్యతిరేక నిర్ణయాలు ఉండవని, ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ.. వారి ఆస్తులకు రక్షణ కల్పించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నల్లమల, శ్రీశైలం నుంచి శేషాచలం వరకు ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేసి పులుల సంరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. నిన్న మంగళగిరిలోని అరణ్య భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పులుల దినోత్సవంలో ఉపముఖ్యమంత్రి పాల్గొన్నారు.రాష్ట్రంలో పులుల సంఖ్య, అభయారణ్యంలో తీసుకోవలసిన భద్రత చర్యలపై పవన్ కళ్యాణ్ సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలోని పులుల సంరక్షణతో పాటు అభయారణ్యాలలో పులుల సంఖ్యను పెంచేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటామని తెలుపుతూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త లబ్ధిదారులకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న గృహ నిర్మాణ శాఖపై సమీక్ష నిర్వహించారు సమావేశం అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాబోయే 100 రోజుల్లో 1.25 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. వచ్చే ఏడాది కాలంలో 8.25 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కొత్త లబ్ధిదారులకు ఈ విధానం అమలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలుపుతూ,

...వాయిస్ ... 27 సెకన్లు

---------------------------

తెలంగాణలో రెండో విడత రైతు రుణమాఫీ ప్రక్రియను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈరోజు ప్రారంభిస్తారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర శాసనసభ నుంచి ముఖ్యమంత్రి రుణమాఫీ ప్రారంభించనున్నారని అధికారులు తెలిపారు. రెండో విడతలో లక్షన్నర వరకు రైతుల రుణాలు మాఫీ చేయనున్నారు. రెండో విడత ఈ రుణమాఫీకి సంబంధించిన నిధులను సిద్ధం చేసిన ప్రభుత్వం లబ్దిదారుల రైతులఖాతాల్లోకి నేరుగా జమచేయనుంది. మొత్తం రుణమాఫీ ప్రక్రియను ఆగస్టు 15 లేదా ఆగస్టు నెలాఖరు లోపు ప్రభుత్వం పూర్తి చేయనుందని అధికారులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంఈ నెల 19వ తేదిన లక్ష వరకు రుణాలకు సంబంధించిన తొలి విడత రుణమాఫీ చేసింది.

---------------------------

భారీ వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈ ప్రవాహం పెరగడంతో నిన్న సాయంత్రం అధికారులు శ్రీశైలం జలాశయం మూడు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. వరద ప్రవాహం భారీగా వస్తుండటంతో మూడు గేట్లను ఎత్తి ఒక్కో గేటు నుంచి 27వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేసినట్లు కర్నూలు చీఫ్ ఇంజినీర్ కబీర్ బాషా ఆకాశవాణికి తెలుపుతూ,

వాయిస్ (40 సెకన్లు)

-------------------------

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2024-25 బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నిధులపై ఆకాశవాణి విజయవాడ కేంద్రం రూపొందించిన కేంద్ర బడ్జెట్-2024 రాష్ట్రానికి కేటాయింపులు ప్రత్యేక చర్యా కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

-------------------------

తెలంగాణ నూతన కొత్త గవర్నర్‌గా నియమితులైన జిష్ణుదేవ్ వర్మ రేపు రాజ్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తెలంగాణ ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే ఆయనతో ప్రమాణం చేయించనున్నారు. ప్రస్తుతం ఇన్ చార్జ్ గవర్నర్‌గా ఉన్న సీపీ రాధాకృష్ణన్ మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆయన నిన్న బదిలీ అయ్యారు ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో గవర్నర్ రాధాకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఝార్ఖండ్ గవర్నర్గా పని చేస్తున్న సీపీ రాధాకృష్ణన్ ఇప్పటివరకు తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

-------------------------

అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. మానవులను ముఖ్యంగా మహిళలు, చిన్నారులను అక్రమంగా తరలించి వారిని అసాంఘిక కార్యక్రమాలకు వినియోగించడాన్ని నిరోధించేందుకు, అటువంటి చర్యలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఐక్యరాజ్య సమితి 2013 నుంచి ప్రతీ సంవత్సరం జూలై 30వ తేదీన అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని నిర్వహిస్తోంది. మానవ అక్రమ రవాణా నుండి కాపాడబడిన బాధితులను వివక్షకు గురి చేయకుండా, బాధితుల సమస్యలను, అనుభవాలను ఆకళింపు చేసుకోవడం ద్వారా మానవ అక్రమ రవాణా అరికట్టే లక్ష్యంతో ఈ రోజుని నిర్వస్తున్నారు.

-------------------------

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుదుత్పత్తి, సరఫరా మెరుగుపడ్డాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నిన్న హైదరాబాద్‌లోని రాష్ట్ర శాసనసభలో బడ్జెట్ పద్దుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, విద్యుత్ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక కేటాయింపులు జరిపిందని చెప్పారు. అర్హులైన వారందరికీ గృహజ్యోతిని అమలు చేస్తామన్నారు. విద్యుత్ ఒప్పందాలకు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన అవకతవకలపై దర్యాప్తుకు కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజుల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈరోజు, రేపు అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ రోజు నుంచి రెండు రోజుల పాటు తెలంగాణలోని అన్ని జిల్లాలో పలుచోట్ల బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఈ గాలుల వేగం గంటకు 30 నుంచి 40కి.మీల వరకు ఉండొచ్చని వాతావరణ కేంద్రం పేర్కొంది.

=====================